RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 259 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 14-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 259 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 14-4-2026 | పేజీలు : 8 | రూ2/-

## ప్రభుత్వ పనితీరు ప్రజలకు

# క్షేత్రస్థాయిలో కనిపించాలి

### అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

### పాఠశాలలు తెరిచేనాటికి హాస్టళ్లు సిద్ధం

### పట్టణాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

### మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

### పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో పరిపాలనను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేశారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై క్షేత్రస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, పట్టణాల్లో మౌలిక వసతులు, మహిళల భద్రత, అన్న క్యాంటీన్ల నిర్వహణతో పాటు పలు కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పనితీరు ప్రజలకు క్షేత్రస్థాయిలో కనిపించాలని, ఫిర్యాదులకు ఆస్కారం లేని పాలన అందించాలని ఆయన స్పష్టం చేశారు.

**పాఠశాలలు తెరిచేనాటికి హాస్టళ్లు సిద్ధం**

జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు పూర్తిస్థాయి వసతులతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హాస్టళ్లలో టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్లు వంటి మౌలిక సదుపాయాలు కచ్చితంగా పనిచేయాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని స్పష్టం చేశారు. "హాస్టళ్ల వసతుల మెరుగుదలకు 'సాస్కి' నిధులు కేటాయించాం. నిధులు ఇచ్చినా పనులు జరగకపోతే అది అధికారుల వైఫల్యమే అవుతుంది. వసతులు కల్పించడంతో పాటు, వాటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ఆహారం, నీటి సరఫరా, పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం తేడా రాకూడదు," అని ఆయన హెచ్చరించారు. ఉన్నతాధికారులు తరచూ హాస్టళ్లను తనిఖీ చేయాలని సూచించారు.

**పట్టణాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

నగరాలు, పట్టణాల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. పైప్‌లైన్లలోకి డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, తరచూ నీటి నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు. వీధి దీపాలు నిరంతరం వెలగాలని, చెత్త సేకరణ ఎక్కడా ఆగకూడదని చెప్పారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి, పరిష్కరించే వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. "పని పూర్తయ్యాక స్థానికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోండి. ప్రభుత్వం వెంటనే స్పందించిందనే భావన ప్రజల్లో కలగాలి. పారిశుద్ధ్య నిర్వహణలో తాడిపత్రి ఆదర్శంగా నిలుస్తోంది. స్థానిక నేతలు చొరవ తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి" అని చంద్రబాబు అన్నారు.

**మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యత**

మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని

తరువాయి 2లో..

## బీజేపీ ఏర్పడి 46 ఏళ్లైనా మహిళను

# అధ్యక్షురాలిగా నియమించలేదు

### రేవంత్ రెడ్డి




**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

బీజేపీ ఏర్పడి 46 సంవత్సరాలైనప్పటికీ ఇప్పటి వరకు అధ్యక్షురాలిగా మహిళను నియమించలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించిందని, ఇప్పటి వరకు 15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగిందని అన్నారు. కానీ ఒక్కసారి కూడా మహిళకు అధ్యక్ష పదవి అప్పగించలేదని విమర్శించారు. దీనిని బట్టి బీజేపీకి

తరువాయి 2లో..

# భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది: ప్రధాని నరేంద్రమోదీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

చట్టసభల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో చట్టం కానుందని, తద్వారా భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశించి నేడు ఢిల్లీలో నిర్వహించిన

తరువాయి 2లో..



# ఈ వారంలోనే ఏపీ ఇంటర్ ఫలితాలు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఏపీలో ఇంటర్ పరీక్షల రాసిన విద్యార్థులకు కీలక అప్‌డేట్! ఈ పరీక్షల ఫలితాలను ఈ వారంలోనే విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 16న విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మూల్యాంకనం పూర్తి కావడంతో.. ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైంది. తాజాగా ఈ ప్రక్రియ పూర్తవ్వడంతో ఫలితాలను అతి త్వరలోనే ప్రకటించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన అప్‌డేట్స్‌ని ఎప్పటికప్పుడు

తరువాయి 2లో..

# ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజు

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్**


శ్రీకాకుళం జిల్లా ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం నెరవేరింది. జిల్లా చరిత్రలో తొలిసారిగా తిరుపతికి నేరుగా వెళ్లే రెగ్యులర్ రైలు సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం రోడ్ – తిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (17439/40) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రోజు శ్రీకాకుళం

తరువాయి 2లో..

## అశ్రునయనాల మధ్య

# ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు...

### ముంబైలో ముగిసిన అంత్యక్రియలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. దిగ్గజ గాయని, స్వర సామ్రాజ్ఞి ఆశా భోంస్లే (92) పంచభూతాల్లో లీనమయ్యారు. ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సూర్యాస్తమయ వేళ, అశ్రునయనాల మధ్య ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, రాజకీయ

తరువాయి 2లో..

## పుర ఎన్నికలకు

# సన్నాహాలు

### 13 నగరాలు, 87 పట్టణాల్లో మొదలైన పునర్విభజన

### కొత్తగా పెరగనున్న 736 డివిజన్లు, వార్డులు

### రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాల ప్రచురణకు కసరత్తు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్విభజన ప్రక్రియ

తరువాయి 2లో..

# అమెరికా దిగ్బంధనం వేళ.. హర్మూజ్‌లో 15 భారత నౌకలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హర్మూజ్ జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తామంటూ అమెరికా చేసిన ప్రకటనతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

తరువాయి 2లో..

## అమరావతి బిల్లుకు

# రాజముద్ర..

### రాష్ట్రపతి ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎంపీలు

### రైతుల త్యాగఫలం అమరావతి

### పోరాడితేనే చిరస్థాయిగా నిలుస్తుంది: రాష్ట్రపతి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేందుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### ఇక.. గ్రేటర్ విజయవాడ..

# టీడీపీకి లాభమెంత..?

విజయవాడ మహానగరాన్ని మరింత విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న విజయవాడ ను గ్రేటర్ విజయవాడ గా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. ఈ క్రమంలో చుట్టుపక్కల ఉన్న 70- 80 గ్రామాల వరకు విజయవాడలో విలీనం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. తద్వారా విజయవాడ నగర పరిధి భారీ స్థాయిలో పెరగనుంది. దీనిలోకి గన్నవరంలోని పలు ప్రాంతాలు అదేవిధంగా పనమలూరులో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు కూడా కలవనున్నాయి. తద్వారా గ్రేటర్ విజయవాడను విస్తరించి రాజధానికి అనుసంధానం చేయాలన్నది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఇప్పటికే కృష్ణ నదిపై ప్రకాశం బ్యారేజీకి సమాంతరంగా మరో బ్యారేజీని నిర్మించనున్నారు. దీనికి కూడా టెండర్లు పిలిచారు. తద్వారా విజయవాడ నగరానికి అమరావతికి మధ్య అనుసంధానం ఏర్పడుతుంది. అయితే, గ్రేటర్ విజయవాడ ఏర్పడటం వల్ల రాజకీయంగా టిడిపికి ఎలాంటి ప్రయోజనం జరుగుతుందని ప్రధాన చర్చ. గతంలో జిల్లా విభజన ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా తమ మేలు జరుగుతుందని వైసీపీ అంచనా వేసుకుంది. కానీ గత ఎన్నికల్లో అది విఫలమైన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయవాడ ను గ్రేటర్ విజయవాడ గా మార్చడం వల్ల టిడిపికి ఏమైనా ప్రయోజనం ఉంటుందా లేకపోతే అసలు ఏం జరుగుతుంది అనేది ఆ పార్టీకి సంబంధించిన కీలక నాయకుల మధ్య చర్చ నడుస్తోంది. ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అంశాలను తీసుకుంటే ఇటు హైదరాబాద్ దిశగా గొల్లపూడి వైపు, గన్నవరం వైపు వచ్చేసరికి నున్న, అదే విధంగా విజయవాడ బెంజ్ సర్కిల్ దాటిన తర్వాత కానూరు వరకు మాత్రమే ఈ పరిధి విస్తరించి ఉంది. దీనిని ఇప్పుడు అటు కంకిపాడు వరకు.. ఇటువైపు దాదాపు గన్నవరం దాకా అలాగే గుంటుపల్లి ఇబ్రహీంపట్నం వరకు కూడా విజయవాడ నగర పరిధిని విస్తరించాలని నిర్ణయించుకున్నారు. ఇవన్నీ టీడీపీకి అనుకూలంగా ఉన్న నియోజకవర్గాల్లో జరుగుతున్న మార్పులు కావడంతో తమకు మేలు జరుగుతుందని ఆయా పార్టీ వర్గాల మాట. గ్రామాలను విజయవాడలో కలపాలని కొన్ని గ్రామాల ప్రజలు కోరుతుంటే మరికొన్ని గ్రామాలు మాత్రం వద్దని జిల్లా పరిధిలోనే ఉంటామని చెబుతున్నాయి. ఇట్లా భిన్నమైనటువంటి అంశాలు తెరమీదకు వచ్చాయి. అయినప్పటికీ గ్రేటర్ విజయవాడ ను విస్తరించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. దీనివల్ల నగర పరిధి పెరిగి రాజధానికి అనుసంధానం ఏర్పడుతుందని ప్రభుత్వం చెబుతోంది. తద్వారా రాజధాని పరిధిలోనే విజయవాడ నగరం కూడా కొనసాగుతుందని భావిస్తోంది. ఇది పార్టీ పరంగా తమకు మేలు చేస్తుందని నాయకులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వచ్చే ఏడాది నాటికి పూర్తిచేయాలని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. గన్నవరం, నూజివీడు, పెనమలూరు, మైలవరం వంటి కీలక నియోజకవర్గాలకు సంబంధించిన 70 నుంచి 80 గ్రామాలు విజయవాడలో విలీనం కానున్నాయి. తద్వారా విజయవాడ నగరపాలక సంస్థకు ఆదాయం పెరగడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని రహదారులు విద్యుత్ సౌకర్యం ఇంటింటికి నీరు పారిశుధ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. అంతేకాదు రాజధానికి అనుసంధాన నగరంగా కూడా విజయవాడ ఉంటుందని అంచనా వేస్తోంది.

### అమెరికా దిగ్బంధనం వేళ..

## హర్మ్యూజ్‌లో 15 భారత నౌకలు

రాజుకున్నాయి. ఈ పరిణామాలతో చమురు, గ్యాస్ సరఫరాపై దేశంలో ఆందోళనలు మొదలయ్యాయి. హర్మ్యూజ్ మీదుగా రావాల్సిన 15 భారతీయ నౌకలు ప్రస్తుతం ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. వీటిలో ఎక్కువగా ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ క్యారియర్లు, క్రూడాయిల్ (జతీబఒవ శీఱశ్రీ) ట్యాంకర్లతో పాటు ఓ కెమికల్ కంటైనర్ కూడా ఉన్నట్టు సమాచారం. అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని ఇరాన్ ఓడరేవులను సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి దిగ్బంధిస్తామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరానేతర ఓడరేవుల మధ్య హర్మ్యూజ్ మీదుగా నౌకల రవాణాను నిలిపివేయనప్పటికీ.. అమెరికా ప్రకటనతో ఈ జలసంధిలో నౌకల రవాణా నెమ్మదించింది. నౌకల రాకపోకలు అకస్మాత్తుగా తగ్గినట్లు ట్రాకింగ్ నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత నౌకాదళం.. హర్మ్యూజ్‌లో నిలిచిపోయిన వాణిజ్య నౌకలతో సమన్వయం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం నౌకాదళానికి చెందిన ఆరు ఓడలు ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ సమీపంలో మోహరించాయి. వాణిజ్య నౌకలను సురక్షితంగా హర్మ్యూజ్ దాటించేందుకు ఇవి సాయపడనున్నాయి. ఈ జలసంధి మార్గంలో మొత్తం 25 భారత నౌకలుండగా.. వీటిలో 10 ఇప్పటికే సురక్షితంగా హర్మ్యూజ్‌ను దాటాయి.

### ప్రభుత్వ పనితీరు ప్రజలకు

# క్షేత్రస్థాయిలో కనిపించాలి

ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. "మహిళల జోలికి రావాలన్నా, అఘాయిత్యం చేయాలనే ఆలోచన రావాలన్నా నేరస్థులు వణికిపోవాలి. తప్పు చేసిన వారిని అరెస్టు చేయడమే కాదు, వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. మహిళల్లో భయాన్ని పోగొట్టి, తప్పు చేసేవారిలో భయాన్ని పెంచాలి" అని ఆయన అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని, గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితి మెరుగుపడిందని, దీన్ని పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. గంజాయి నివారణకు రాష్ట్రంలో అమలు చేస్తున్న 'ఈగల్' విధానాన్ని ఒడిశా ప్రభుత్వం కూడా ఆదర్శంగా తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

**పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లు**

పేదవాడి ఆకలి తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ముఖ్యమంత్రి, అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ నియోజకవర్గాల్లో కూడా ఈ క్యాంటీన్లను విస్తరించనున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణ కోసం ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేందుకు దాతలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పేదలు సంతృప్తిగా, కడుపునిండా భోజనం చేసేలా క్యాంటీన్లను నిర్వహించాలని, అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

ఆవిష్కరణలు, సాంకేతికతపై సరికొత్త ప్రణాళికలు

రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా మార్చే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణల ఆలోచనలను ప్రోత్సహించాలన్నారు. అగస్త్య ఫౌండేషన్ వంటి సంస్థలతో కలిసి పనిచేయాలని, 175 నియోజకవర్గాల్లోని ఎంఎస్ఎంఈ పార్కులతో ఆర్టీఐహెచ్‌ను అనుసంధానించాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అల్లూరి, మన్యం, పోలవరం జిల్లాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందించే పైలట్ ప్రాజెక్టును చేపట్టాలన్నారు. 'జలధార' కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి సమర్థవంతంగా అమలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ఆదేశించారు. చెరువులు నింపే విషయంలో అన్నమయ్య జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలని, అవసరమైతే ఇతర జిల్లాల బృందాలకు అక్కడ శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### పుర ఎన్నికలకు

# సన్నాహాలు

ప్రారంభమైంది. వీటిలో ప్రస్తుతం 3,206 డివిజన్లు, వార్డులున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా వీటిని విభజించనున్నారు. పాత, కొత్త డివిజన్లు, వార్డులకు నాలుగు వైపులా హద్దులు (బౌండరీలు) నిర్ణయించాక ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చి, ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. అనంతరం మార్పులు, చేర్పులతో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తుది ఆమోదం కోసం పంపనున్నారు. పునర్విభజనతో డివిజన్లు, వార్డుల సంఖ్య 3,942కి పెరగనుంది. అంటే.. కొత్తగా 736 అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోని పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17తో ముగిసింది. మరో నగరపాలక సంస్థ, ఇంకో 12 పురపాలక, నగర పంచాయతీల్లో నవంబరులో ముగియనుంది. వీటన్నింటికి కలిపి ఇప్పుడు ఎన్నికలు నిర్వహించినా.. పాత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తరువాతే కొత్తగా ఎన్నికైన వారు బాధ్యతలు చేపడతారు. పురపాలక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలివ్వడంతో అందుకు అనుగుణంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సన్నద్ధమవుతోంది. ఆగస్టు, సెప్టెంబరుల్లో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు వేర్వేరుగా నోటిఫికేషన్లను ఇటీవల జారీ చేసింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెలాఖరుకు పునర్వభజన ప్రక్రియ పూర్తి చేయాలి. అధికారులు, సిబ్బంది జనగణన ఏర్పాట్లలో ఉన్నారన్న పురపాలక, నగరపాలక సంస్థల విజ్ఞప్తిపై వచ్చే నెలాఖరు వరకు గడువు పెంచారు. పునర్విభజనపై కొన్నిచోట్ల రెండు రోజుల క్రితం క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభమైంది. ప్రస్తుతం ఒక్కో డివిజన్, వార్డుని రెండుగా విభజించొచ్చని అంచనా. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప నగరపాలక సంస్థల్లో ఒక్కోచోట 20 వరకు డివిజన్లు పెరగనున్నాయి.

**డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు**

బీసీల గణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వచ్చే నెలలో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా వార్డులు, డివిజన్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలు నెలాఖరులోగా కొలిక్కి రానున్నాయి. ఓటర్ల జాబితాలను 2026 మార్చి 9న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక శాఖను ఆదేశిస్తూ ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ ఇచ్చింది. మరికొంత సమయం కావాలన్న ఆ శాఖ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఓటర్ల జాబితాల ప్రచురణకు మరోసారి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో నగరం, పట్టణంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

**కొత్త ఎస్ఈసీ ఎవరు?**

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ (ఎస్ఈసీ)గా ఎవరిని నియమిస్తారన్న దానిపై ఆసక్తి నెలకొంది. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఒక ఐఏఎస్ పేరు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని గత నెల 31న బాధ్యతల నుంచి వైదొలిగారు. ఎన్నికల సంఘం కార్యదర్శికి ప్రస్తుతానికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

పునర్విభజనతో వార్డులు, డివిజన్ల సంఖ్య ఇలా పెరగనుంది.. 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ప్రస్తుత వార్డుల సంఖ్య: 2,481. పునర్విభజన తరువాత వాటి సంఖ్య: 3,020. 13 నగరపాలక సంస్థల్లో ప్రస్తుత డివిజన్ల సంఖ్య: 725. పునర్విభజన తరువాత వాటి సంఖ్య: 922. కోర్టు కేసులు తేలాకే మరో 23 చోట్ల ఎన్నికలు: రాష్ట్రంలో 23 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున.. వాటికి ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించకపోవచ్చని తెలుస్తోంది. చుట్టుపక్కల పంచాయతీలు, గ్రామాలను పుర, నగరపాలక సంస్థల్లో గత మున్సిపల్ ఎన్నికల ముందు విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో పలువురు కోర్టుల్లో కేసులు వేశారు. ఇవి పరిష్కారమయ్యాక వాటిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

### అమరావతి బిల్లుకు

# రాజముద్ర..

సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్–మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్రపతికి వివరించారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీయేనని, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన నాయకత్వంలోనే పనులు తిరిగి ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. అనంతరం, అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్, పర్యావరణ హిత నిర్మాణాల విశేషాలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

**రైతుల త్యాగఫలం అమరావతి**

రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని లోకేష్ రాష్ట్రపతికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా శాంతియుతంగా ఉద్యమం కొనసాగించారని వివరించారు.

**పోరాడితేనే చిరస్థాయిగా నిలుస్తుంది: రాష్ట్రపతి**

మంత్రి లోకేశ్, ఎంపీల బృందం చెప్పిన విషయాలను సావధానంగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమరావతి చట్టం తన హయాంలో రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంపై ప్రేమతో రైతులు తమ భూములను త్యాగం చేయడాన్ని ఆమె ప్రశంసించారు. "పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం తనకుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

## ఏపీలో ఇంటర్ ఫలితాలు ఎప్పుడంటే?

తెలుసుకోవచ్చు. మరోవైపు, తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. గతంలో కన్నా ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తంగా ప్రథమ ఇంటర్‌లో 66.20శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు బోర్డు తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

### బీజేపీ ఏర్పడి 46 ఏళ్లైనా మహిళను

# అధ్యక్షురాలిగా నియమించలేదు

మహిళల పట్ల ఉన్న గౌరవం, చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. ముందు బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించిన తర్వాత బండి సంజయ్ మహిళలకు న్యాయం చేయడం గురించి మాట్లాడాలని సూచించారు. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షిణాది రాష్ట్రాలలోని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వ్యతిరేకమని విమర్శించారు. తమ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తెలంగాణను సాధించారని, ఇప్పుడు నియోజకర్గాల పునర్విభజనపై కూడా పోరాడతారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను ఏకం చేస్తామని అన్నారు. పార్లమెంటులో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సవాల్ చేశారు. 60 ఏళ్లలో మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని అన్నారు. కానీ బీజేపీ మహిళా అధ్యక్షురాలిని కాదు కదా, జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్ పదవి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మహిళలను చిన్నచూపు చూడటమే బీజేపీ లక్షణమని, వారు మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్రం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్‌దే అన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మోదీ ఇంటి ముందు బంట్రోతులుగా నిలబడుతారని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై అన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ వంటి చిన్న రాష్ట్రాలకు లేఖ రాస్తానని వెల్లడించారు.

## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది: ప్రధాని నరేంద్రమోదీ

'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అత్యంత అవసరమని మోదీ అన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందని తెలిపారు. ప్రతి పార్టీ దీనిని ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని వ్యాఖ్యానించారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అశ్రునయనాల మధ్య ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు...


ప్రముఖులు, అభిమానుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణలతో తుది సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ సభ్యులు 'లాస్ట్ పోస్ట్' వాయిస్తూ ఆమెకు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించారు. అంతకుముందు ఆమె నివాసం నుంచి శివాజీ పార్క్ వరకు భారీ ఊరేగింపుతో అంతిమయాత్ర సాగింది. ఆశా భోంస్లే ఏప్రిల్ 12న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరినట్లు తొలుత వార్తలు వచ్చినా, ఛాతీ ఇన్ఫెక్షన్, తీవ్రమైన అలసట కారణంగా ఆమె మరణించినట్లు మనవరాలు జానై భోంస్లే వెల్లడించారు. పదేళ్ల వయసులోనే మరాఠీ చిత్రంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించిన ఆశా భోంస్లే, ఎనిమిది దశాబ్దాలకు పైగా తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. 'ఉమ్రావ్ జాన్', 'తీస్రీ మంజిల్', 'రంగీలా' వంటి చిత్రాల్లో ఆమె పాడిన ఎన్నో గీతాలు అజరామరంగా నిలిచిపోయాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'తౌబా తౌబా' పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది. ఆమె మరణంతో భారతీయ సంగీతంలో ఓ సువర్ణాధ్యాయం ముగిసినట్లయింది.

## ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజు

జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రక్షేత్రంతో ఈ రైలు అనుసంధానం చేస్తుందని తెలిపారు. దీనివల్ల వేలాది మంది భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందన్నారు. ప్రయాణికులతో మాట్లాడినప్పుడు వారిలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సేవ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. ఈ కొత్త రైలు సేవను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ఎన్‌డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదని, శ్రీకాకుళం ప్రజల ఆశలు, ఆకాంక్షలను అభివృద్ధికి అనుసంధానించే కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో భూ మాఫియా రాజ్యం...

## ప్రభుత్వ ఆదేశాలు గాలికొదిలిన రెవెన్యూ అధికారులు




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు సేవ చేయాల్సిన రెవెన్యూ శాఖపై అవినీతి ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా భూమి సంబంధిత పనుల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పహాణీలు, అడంగల్‌లు, భూ రికార్డుల సవరణలు, పాస్‌బుక్‌ల జారీ వంటి సాధారణ సేవలు కూడా లంచాలు లేకుండా పూర్తికావడం కష్టమవుతోందని రైతులు వాపోతున్నారు. రైతులు తమ భూమి సమస్యలు పరిష్కరించుకునేందుకు నెలలు కాదు, సంవత్సరాల పాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. "ఫైల్ కదలాలంటే చెల్లింపు తప్పనిసరి" అనే అనధికార విధానం అమలులో ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కొంతమంది అధికారుల వద్ద లంచాల వ్యవహారం ఒక అలవాటుగా మారిపోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తుల వ్యవస్థ మరింత బలపడుతూ రైతులను దోచుకునే విధంగా పనిచేస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. ఇటీవల అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కీలక సమావేశం నిర్వహించింది. రాష్ట్ర అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలపై సమీక్ష నిర్వహించిన ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూ మాఫియా పెరుగుతోందని, రాజకీయాలను అడ్డుగా పెట్టుకుని కొంతమంది బడా వ్యక్తులు భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని స్పష్టంగా చర్చించబడింది. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ స్థాయిలో ఆదేశాలు జారీ అయినప్పటికీ, వాటి అమలు విషయంలో మాత్రం స్పష్టమైన మార్పు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో భూ అవినీతి ఎక్కువగా జరుగుతోందని గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా బహిరంగంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ స్థాయిలో చేసిన వ్యాఖ్యల తర్వాత కూడా స్థాయివంతమైన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో మరింత ఆందోళనకు దారి తీస్తోంది. తప్పులు చేసిన అధికారులపై సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాల్సిన చోట, కేవలం బదిలీలతో సరిపెట్టడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. కొంతమంది అధికారులకు రాజకీయ మద్దతు లభించడం వల్ల విచారణలు నెమ్మదించడం లేదా ప్రభావం కోల్పోవడం జరుగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. దీనివల్ల "తప్పు చేసినా తప్పించుకోవచ్చు" అనే ధైర్యం పెరుగుతోందని విమర్శకులు చెబుతున్నారు. ఇక ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాల్సిన వ్యవస్థలో వేల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉండటం మరో పెద్ద సమస్యగా మారింది. ప్రజలు ఫిర్యాదులు చేసినా వాటి పరిష్కారం ఆలస్యం అవుతుండటం, కొన్నిసార్లు పూర్తిగా పట్టించుకోకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. "ప్రజలంటే అధికారులకు ఎందుకు అంత చిన్న చూపు? ప్రభుత్వం మారినా అధికారుల తీరు ఎందుకు మారడం లేదు?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమస్యలు పరిష్కారం కాక కొంతమంది రైతులు తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకోవడం. భూమి రికార్డుల కోసం ఒక రైతు ఇంతటి మానసిక ఒత్తిడికి గురవ్వాల్సి రావడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం అని నిపుణులు అంటున్నారు. రెవెన్యూ అధికారుల అసలు బాధ్యతలు ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడం, భూ రికార్డులను కచ్చితంగా నిర్వహించడం, రైతుల సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించడం అయినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో ఈ బాధ్యతలు అనేక చోట్ల పక్కన పడిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. లంచాలు స్వీకరించడం, ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా పెండింగ్‌లో ఉంచడం, అక్రమాలకు సహకరించడం వంటి చర్యలు ప్రజల విశ్వాసానికి ద్రోహంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి ఆరోపణలపై వేగవంతమైన, పారదర్శక విచారణలు జరిపి, తప్పు నిర్ధారణ అయితే కఠిన శిక్షలు విధించాలని కోరుతున్నారు. కేవలం బదిలీలతో సమస్యలు పరిష్కారం కావని స్పష్టంగా చెబుతున్నారు. అలాగే ప్రతి సేవకు గడువు విధానం అమలు చేయడం, డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఫిర్యాదు వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మొత్తానికి, రైతు దేశానికి వెన్నెముకగా భావించబడుతున్న ఈ సమయంలో, అతడే అవినీతి బారిన పడటం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. రెవెన్యూ శాఖలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన ఏర్పడితేనే రైతులకు నిజమైన న్యాయం జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. లేకపోతే అవినీతి బారిన పడిన రైతు జీవితం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.


## తల్లి,శిశు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధి పునాది: పల్లా శ్రీనివాసరావు



**గాజువాక, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లి--శిశు సంక్షేమం కీలకమని భావించిన కూటమి ప్రభుత్వం, పోషకాహార లోప నిర్మూలనపై దృష్టి సారిస్తోంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన పోషణపక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం రాష్ట్ర భవిష్యత్తును బలోపేతం చేసే ముఖ్య బాధ్యత అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని అన్నారు. పోషణపక్వాడ కార్యక్రమాల ద్వారా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో తల్లులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యకర జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భధారణ నుంచి చిన్నారి రెండేళ్లు వచ్చే వరకు మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో సరైన పోషణ, సంరక్షణ అవసరమని పేర్కొన్నారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి సాంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించే దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని, ప్యాకెట్ ఆహారాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుతున్నామని చెప్పారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సులో పిల్లల మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఈ దశలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమని వివరించారు. పిల్లలతో మాట్లాడడం, ఆడించడం, కథలు చెప్పడం ద్వారా వారి అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని సూచించారు. కుటుంబ స్థాయిలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు పురుషుల భాగస్వామ్యాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. "మొదటి 1000 రోజులు కీలకం", "జంక్ ఫుడ్‌కు బదులుగా ఇంటి వంట ఆరోగ్యానికి మార్గం", "పిల్లలతో గడిపే సమయమే వారి భవిష్యత్తు" వంటి సందేశాలతో పోస్టర్లు విడుదల చేశారు. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోషణపక్వాడ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు



**విశాఖసిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షులు పరశురామరాజు ఈరోజు విశాఖపట్నం నూతన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరశురామరాజు బీజేపీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను కలెక్టర్ కి పరిచయం చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన సమస్యలు, పార్టీ కార్యకలాపాల గురించి కూడా చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు బొత్సా సురేష్ కుమార్, రాష్ట్ర మీడియా ప్రతినిధి కెఎన్ఆర్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ బాబు, పార్టీ నాయకులు రవిరాజ్, జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త రాకేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి పరస్పర సహకారం అవసరమని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు.

## ప్రజా ఫిర్యాదుల వేదికలో 67 ఫిర్యాదులు... 7 రోజుల్లో పరిష్కారం చేయాలని ఎస్పీ ఆదేశం

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 13**

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పి.జి. ఆర్. ఎస్) కార్యక్రమంలో మొత్తం 67 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. వీటిలో భూ తగాదాలు 35, కుటుంబ కలహాలు 2, మోసపూరిత వ్యవహారాలు 5, ఇతర సమస్యలు 25 వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని, 7 రోజుల్లో విచారణ పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తీసుకున్న చర్యలపై నివేదికలను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు. ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ, ప్రజలకు వేగంగా న్యాయం అందించడం పోలీసుల బాధ్యత అని, సమస్యలను పారదర్శకంగా పరిష్కరించడంలో పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు సహా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా రామతీర్థం శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాల నిమజ్జనం

### *దుండగుల దాడిలో ధ్వంసమైన విగ్రహాలు నిమజ్జనం*

### *ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు*

**ఐ పోలవరం సృజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

రామతీర్థం శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించబడింది. కోటిపల్లి రేవులో హోమ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, విగ్రహాలను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, విజయనగరం జిల్లా రామతీర్థంలోని కోదండ రామస్వామి ఆలయంలో 2020 డిసెంబరు 28న దుండగుల దాడిలో ధ్వంసమైన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుల విగ్రహాలను నేడు శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసినట్లు తెలిపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా భక్తులను కలచివేసిందని, కేసు ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉందన్నారు. ఆగమశాస్త్రం ప్రకారం ధ్వంసమైన విగ్రహాలను ఆలయంలో ఉంచకూడదని, కోర్టు అనుమతితో అన్ని విధివిధానాలు పూర్తి చేసి నిమజ్జన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రామతీర్థం నుంచి పలు ప్రముఖ ఆలయాల మీదుగా కోటిపల్లి రేవుకు తీసుకువెళ్లి హోమాలు నిర్వహించి గోదావరిలో నిమజ్జనం చేసినట్లు వివరించారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో ఆలయాలపై జరిగిన ఘటనలు ఆందోళన కలిగించాయని,



ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ సహా ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టుదలే ఆయుధం... ఇంటర్‌లో మెరిసిన రామ్ చరణ్



**కర్నూల్ జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండల కేంద్రానికి చెందిన రామ్ చరణ్ కె ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. మొత్తం 1000 మార్కులకు గాను 983 మార్కులు సాధించి విశేష విజయాన్ని నమోదు చేశాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన రామ్ చరణ్, తన కృషి, పట్టుదలతో ఈ ఘనత సాధించాడు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపుతూ, క్రమశిక్షణతో చదివిన ఫలితంగా ఈ స్థాయి ఫలితాన్ని అందుకున్నాడు. తల్లిదండ్రులు నరేందర్, సుప్రజల ప్రోత్సాహం మరియు గురువుల మార్గదర్శకం తనకు పెద్ద బలమైందని రామ్ చరణ్ తెలిపాడు. కుటుంబ సభ్యులు కూడా అతని కృషిని ప్రశంసిస్తూ, అతని విజయానికి అందరి సహకారం కారణమని పేర్కొన్నారు. రామ్ చరణ్ విజయం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అతనిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 22




ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత స్వేఛ అనేది అత్యంత ప్రాథమికమైన హక్కు. ప్రజల శ్రేయస్సు, భద్రత కోసం చట్టాలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, ఆ అధికారం వ్యక్తిగత స్వేఛను అన్యాయంగా హరించే విధంగా ఉపయోగించరాదు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను సాధించేందుకు భారత రాజ్యాంగంలో కీలకంగా రూపొందించబడిన నిబంధనలలో ఆర్టికల్ 22 ఒకటి. ఆర్టికల్ 22 ప్రధానంగా అరెస్టు, నిర్బంధం వంటి పరిస్థితుల్లో వ్యక్తుల హక్కులను రక్షించడమే కాకుండా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వానికి నివారణ నిర్బంధం అమలు చేసే అధికారాన్ని కూడా కల్పిస్తుంది. అందువల్ల ఇది వ్యక్తిగత హక్కులు మరియు ప్రజా భద్రత మధ్య సున్నితమైన సమతుల్యతను ప్రతిబింబిస్తుంది. సాధారణంగా అరెస్టు చేయబడిన వ్యక్తులకు ఆర్టికల్ 22 కొన్ని ముఖ్యమైన రక్షణలను కల్పిస్తుంది. ఒక వ్యక్తిని అరెస్టు చేసిన వెంటనే, అతనికి అరెస్టుకు గల కారణాలను వీలైనంత త్వరగా తెలియజేయాలి. ఇది యాదృచ్ఛిక అరెస్టులను నివారించడంలో కీలకంగా ఉంటుంది. అదేవిధంగా, అరెస్టు చేయబడిన వ్యక్తికి తనకు నచ్చిన న్యాయవాదిని సంప్రదించే హక్కు ఉంటుంది. ఈ హక్కు ద్వారా అతను న్యాయపరమైన ప్రక్రియలో తన హక్కులను సమర్థంగా రక్షించుకోవచ్చు. ఇంకా ఒక ముఖ్యమైన రక్షణ ఏమిటంటే, అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోపు (ప్రయాణ సమయాన్ని మినహాయించి) మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి. న్యాయపరమైన పర్యవేక్షణ లేకుండా ఎవరినైనా ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచకుండా ఉండేందుకు ఈ నిబంధన ఎంతో ముఖ్యమైనది. అయితే ఈ హక్కులు ప్రతి ఒక్కరికీ వర్తించవు. శత్రు దేశాల పౌరులు మరియు నివారణ నిర్బంధం కింద అరెస్టు చేయబడిన వ్యక్తులు ఈ రక్షణల నుండి మినహాయించబడతారు. నివారణ నిర్బంధం అనేది సాధారణ అరెస్టుతో భిన్నమైనది. ఇందులో వ్యక్తి భవిష్యత్తులో నేరం చేసే అవకాశం ఉందని భావించి, ముందస్తుగా కోర్టు విచారణ లేకుండానే నిర్బంధించవచ్చు. ప్రజా భద్రత, దేశ భద్రత వంటి అత్యవసర పరిస్థితుల్లో ఇది ఉపయోగపడుతుంది. అయితే, ఈ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా కొన్ని పరిమితులు కూడా విధించబడ్డాయి. నివారణ నిర్బంధం కింద ఒక వ్యక్తిని మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచాలంటే, సలహా మండలి అనుమతి తప్పనిసరి. ఈ మండలి హైకోర్టు న్యాయమూర్తుల అర్హత కలిగిన వ్యక్తులతో ఉంటుంది. అలాగే, నిర్బంధంలో ఉన్న వ్యక్తికి నిర్బంధానికి గల కారణాలను తెలియజేయాలి మరియు అతనికి తనపై విధించిన నిర్బంధంపై అభ్యంతరం చెప్పుకునే అవకాశం ఇవ్వాలి. అయితే, ప్రజా ప్రయోజనాలకు హానికరమని భావించిన కొన్ని వివరాలను ప్రభుత్వం వెల్లడించాల్సిన అవసరం లేదు. అదనంగా, పార్లమెంట్‌కు నివారణ నిర్బంధానికి సంబంధించిన విధానాలను, కాల పరిమితులను మరియు ఇతర నిబంధనలను నిర్ణయించే అధికారం కూడా కల్పించబడింది. మొత్తం మీద ఆర్టికల్ 22 వ్యక్తిగత స్వేఛను రక్షించడంలో కీలకమైన రాజ్యాంగ నిబంధన. ఇది ఒకవైపు అన్యాయ అరెస్టుల నుండి ప్రజలను కాపాడుతుండగా, మరోవైపు దేశ భద్రత కోసం అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వానికి చర్యలు తీసుకునే అవకాశాన్ని కూడా ఇస్తుంది. అందువల్ల, ఇది ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత హక్కులు మరియు ప్రభుత్వ బాధ్యతల మధ్య సమతుల్యతను నిలబెట్టే ఒక ముఖ్యమైన ఆధారం.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి.**

## అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎంపీ కి ఆహ్వానం



**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ):ఏప్రిల్ :13:**

విజయవాడ భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ శృతివనంలో నిర్వహించనున్న ఉత్సవ వేడుకలకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని సెంట్రల్ శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వర రావు సారథ్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బెజ్జం జయపాల్ , సెంట్రల్ నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షులు వేల్పుల రాజేష్ కలిసి ఎంపీని కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు చాటిచెప్పే విధంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ ని కోరిన మైలపల్లి రాజు, తదితరులు.

# అంబేద్కర్ జయంతి బైక్ యాత్రలో గిరిజనుల గళం గర్జించింది





**రావికమతం,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్‌పురం గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గిరిజన సంఘం, కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో సామాజిక చైతన్య బైక్ యాత్ర సోమవారం ప్రారంభమైంది. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించిన అనంతరం అజయ్‌పురం నుంచి జెడ్ జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగింది. ఈ యాత్ర 14వ తేదీన కొత్తకోట గ్రామంలో ముగియనుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజనులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తీవ్రంగా ప్రస్తావించారు. కళ్యాణ్ లావా ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం చట్టాలను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. నాన్-షెడ్యూల్డ్ గిరిజన మండలాలను ఏజెన్సీ ప్రాంతాల్లో కలపాలని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కచ్చితంగా అమలు చేసి రక్షించాలని కోరారు. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ రావికమతం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ వద్ద పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, బాదంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.41లో ఉన్న భూమిని దళితులు, గిరిజనులకు గృహ నిర్మాణం కోసం కేటాయించాలని అన్నారు. అలాగే సీలింగ్ భూములకు బౌండరీ ఏర్పాటు చేసి పక్కా పట్టాలు ఇవ్వాలని, కొత్తకోట దళిత కాలనీలో తక్షణమే మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు సాగుభూములపై పూర్తి హక్కులు కల్పించి సాగుకు అవసరమైన సదుపాయాలు అందించాలని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న మానిటరింగ్ కమిటీలలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జెడ్ జోగంపేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం, నర్సీపట్నం నుంచి జోగంపేట వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం, దళితులు, గిరిజనులకు విధిస్తున్న అధిక విద్యుత్ బిల్లులను తగ్గించడం వంటి డిమాండ్లు కూడా వినిపించాయి. అలాగే నర్సీపట్నంలో దళితులు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మరింత పెద్ద స్థాయిలో ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రరావు, పాంగి పవన్ కుమార్, వంతల చిరంజీవి, గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలి

### జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

మహిళా సాధికారతకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాల్సిన అవసరం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ పేర్కొన్నారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన "నారీ శక్తి వందన్ సమ్మేళనం"లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మహిళా-శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని, కేంద్రాలు పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లలను తల్లిలా చూసుకుంటూ, వారికి ప్రేమతో సేవలందించాలని సిబ్బందికి సూచించారు.మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుంటే మహిళలు మరింత బలపడతారని తెలిపారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని నాయకత్వాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. నారీ శక్తి వందన్ సమ్మేళనం మహిళలకు ప్రేరణనిచ్చే వేదికగా ఉపయోగపడుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు.

వివాహితపై భర్త కిరాతక దాడి...

## పరామర్శించిన పేడాడ రమణికుమారి

### ఘటనపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు



జగదాంబ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13

విశాఖపట్నంలోని ఆర్ ఓ బి జంక్షన్ సమీప భీమ్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న శ్రీవాణి అనే మహిళపై ఆమె భర్త కొల్లి రామనాయుడు కిరాతకంగా దాడి చేసిన ఘటన కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను ఆసుపత్రులకు తరలించగా, ప్రస్తుతం కేజీహెచ్‌లో ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ, వైఎస్సార్సీపీ మహిళా విభాగం నాయకురాలు పేడాడ రమణికుమారి ఇతర మహిళా నేతలతో కలిసి బాధితురాలిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.అనంతరం పోలీస్ కమిషనర్‌ను కలిసి ఘటన వివరాలు తెలియజేసి, బాధితురాలిపై దాడి చేసిన భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా భర్త వేధింపులకు గురవుతున్న శ్రీవాణిపై చిన్న కారణంతో బెల్టుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. మహిళలపై పెరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసిన నేతలు, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. బాధితురాలికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.




## కోడిపందాలు స్థావరాలు పై పోలీసుల మెరుపు దాడి... 9 మంది అరెస్ట్



**అనకాపల్లి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

జాతరలను ఆసరాగా చేసుకుని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నాతవరం పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. మాసమ్మ తల్లి జాతర నేపథ్యంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై ఆకస్మికంగా దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేయడంతో పాటు నగదు, కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ పర్యవేక్షణలో నాతవరం పోలీసులు ఈ దాడులను విజయవంతంగా నిర్వహించారు. నాతవరం మండలం వీబీ అగ్రహారం గ్రామంలో జరుగుతున్న మాసమ్మ తల్లి జాతరను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ సమాచారంతో అప్రమత్తమైన నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు సిబ్బందితో కలిసి ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. దాడుల సమయంలో కోడిపందాలు ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో వారి వద్ద నుండి ?8,500 నగదు మరియు నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జూదం, కోడిపందాలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రమాదం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఇటువంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్సై వై. తారకేశ్వరరావు మాట్లాడుతూ, పండుగలు, జాతరల పేరుతో కోడిపందాలు లేదా ఇతర జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలను భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.

## డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం

### – విశాఖలో 5 కేజీల గంజాయి స్వాధీనం, ఇద్దరు అరెస్ట్



**కంచరపాలెం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

విశాఖ నగరంలో మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ సహాయంతో ఐదు కిలోల గంజాయిని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు కమిషనర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, భద్రతా విభాగం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల సమయంలో నార్కోటిక్ డాగ్ అనుమానాస్పదంగా ఉన్న ఓ సంచిని గుర్తించింది. వెంటనే పోలీసులు ఆ సంచిని పరిశీలించగా అందులో సుమారు ఐదు కిలోల గంజాయి ఉన్నట్లు నిర్ధారణ అయింది. పోలీసులు వెంటనే ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని అక్కడే ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ కోసం వారిని కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.గంజాయి రవాణా వెనుక ఉన్న మూలాలు, సరఫరా నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు పోలీసులు లోతైన దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన నార్కోటిక్ డాగ్ ఆర్య, డాగ్ హ్యాండ్లర్ మరియు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని పోలీసు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. నగరంలో మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## సామాన్య భక్తులకు సజావుగా నిజరూప దర్శనం

### చందనోత్సవం ఏర్పాట్లపై గంటా ఫోకస్





**సింహాచలం, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ : 13**

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వార్షిక చందనోత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిజరూప దర్శనం కల్పించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్సవ నిర్వహణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఈ నెల 15 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గత ఏడాది చందనోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలు మళ్లీ జరగకుండా ఈసారి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని, మంత్రుల కమిటీ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సాధారణ రోజులతో పోలిస్తే చందనోత్సవం, గిరి ప్రదక్షిణ సమయంలో భక్తుల రద్దీ దాదాపు 10 రెట్లు పెరుగుతుందని, ఆ స్థాయికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారిందన్నారు. ఈసారి పూర్తి స్థాయి ఈఓ బాధ్యతలు నిర్వహిస్తున్నందున ఉత్సవం మరింత సమర్థంగా నిర్వహించగలమనే నమ్మకం ఉందన్నారు. భక్తులు అధికార యంత్రాంగం రూపొందించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, కేటాయించిన సమయ స్లాట్లలోనే దర్శనం చేసుకోవాలని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు. ఈ నెల 20న జరగనున్న చందనోత్సవానికి సంబంధించి క్యూ లైన్లు, తాగునీరు, రవాణా, ప్రసాదాల పంపిణీ, పార్కింగ్ వంటి ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్ల జారీ విధానం మరియు స్లాట్ వ్యవస్థపై అధికారులు వివరాలు అందించారు.ఇదిలా ఉండగా, చందనోత్సవానికి సంబంధించిన ముఖ్య కార్యక్రమమైన చందనం అరగదీత సోమవారం ఆలయంలో ప్రారంభమైంది. గంటా శ్రీనివాసరావు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని గంధపు చెక్కను అరగదీశారు. సంవత్సరం పొడవునా చందనంతో కప్పబడి ఉండే నృసింహ స్వామి, చందనోత్సవం రోజున మాత్రమే భక్తులకు నిజరూప దర్శనం ఇస్తారు. ఉత్సవం అనంతరం స్వామివారిని మళ్లీ చందనంతో కప్పేందుకు అవసరమైన గంధాన్ని సిద్ధం చేసే ప్రక్రియ ఇదే. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అనంతపురంలో ఆపిల్!

### ఆ ఆపిల్ కాదు మండుటెండల్లో మంచు ఫలాలు!

**అనంతపురం:( సిటిజన్ టైమ్స్): ఏప్రియల్ :13**

ఎక్కడైనా మండుటెండలు కాసే రాయలసీమ గడ్డపై ఆపిల్ పండ్లు పండటం సాధ్యమేనా? కశ్మీర్ చలి, హిమాచల్ ప్రదేశ్ మంచు లేకుండా అనంతపురంలో ఆపిల్ సాగు చేయడమంటే.. అది ప్రకృతిని సైతం ఆశ్చర్యపరిచే విజయం!. ఒకప్పుడు కరువుకు కేరాఫ్ అడ్రస్ అనంతపురం. కేవలం వేరుశనగ లేదా పొద్దు తిరుగుడు మాత్రమే కనిపించేది. అక్కడ కియా కార్లను పండించడానికి కంకణం కట్టుకున్నాడు నాయుడు. కాలువల ద్వారా నీటి ప్రవాహాలు మొదలయ్యాయి. చెరువులు నిండాయి. భూగర్భ జలాలు పైకి ఉబికాయి. ఎక్కడికక్కడ చెక్ డ్యామ్ ల నుండి కావాల్సిన వారికల్లా డ్రిప్ పరికరాలు వచ్చాయి. హార్టికల్చర్ లో అద్భుతాలు సృష్టించడం మొదలెట్టిన అన్నదాతలు మరో అడుగు ముందుకేసి కాశ్మీర్ ఆపిల్ వరైటీని మరింత తియ్యగా పండించే ధైర్యం చేశారు. నిజానికి ఆపిల్ అంటేనే మనకు గుర్తొచ్చేది మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు. కానీ అనంతపురంలోని గార్లదిన్నె, కుందుర్పి, పెద్దపప్పూరు మండలాల్లోని రైతులు ఈ అసాధ్యాన్నే సుసాధ్యం చేశారు. ఇక్కడ పండుతున్న కశ్మీర్ లోచిల్లీ డెలిషియస్ రకం ఆపిల్స్, సాధారణ కశ్మీర్ ఆపిల్స్ కంటే మరింత తియ్యగా ఉండటం విశేషం. మొదటి పంటలోనే ఎకరాకు సుమారు ఒక టన్ను దిగుబడి రావడం వ్యవసాయ రంగంలోనే ఒక సంచలనం. నాణ్యమైన పండ్లకు కిలో రూ.170 వరకు ధర పలుకుతోంది, ఇది రైతులకు లాభదాయకమైన ఆదాయ వనరుగా మారింది. సగం మాత్రమే కార్పొరేట్ మార్కెట్లకు విక్రయించిన రమణారెడ్డి మిగిలిన వాటిని అక్కడ చూడ్డానికి వచ్చేవారికి రుచిచూడడానికి గర్వంగా పంచుతున్నారు. ఈ మార్పు వెనుక దశాబ్దాల కృతజ్ఞతతో కూడిన కృషి ఉంది. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రాయలసీమను "ఉద్యానవన హబ్"గా మార్చాలనే సంకల్పంతో తీసుకున్న చర్యలే నేడు ఫలితాలను ఇస్తున్నాయి.






హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టుల ద్వారా వెనుకబడిన ప్రాంతాలకు నీటిని చేరవేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, రైతులకు ధైర్యం వచ్చింది. దేశంలోనే అత్యధికంగా డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలను అందించి, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహించారు. ఒకప్పుడు నీటి చుక్క కోసం అల్లాడిన నేల మీద, నేడు విదేశీ నాణ్యతతో కూడిన పండ్లు పండుతున్నాయి. కశ్మీర్ చలి కంటే అనంతపురం రైతుల గుండెల్లో ఉన్న పట్టుదలే గొప్పదని ఈ పంట నిరూపించింది. కరువు సీమ నుంచి కోట్లు కురిపించే సీమగా అనంతపురం మారుతున్న ఈ ప్రయాణం అద్భుతం.. అమోఘం! నీరు ఉంటే నేల బంగారం అవుతుందని అందరికీ తెలుసు.. కానీ అదే నీటితో ఎడారిలోనూ ఆపిల్స్ పండించవచ్చని అనంతపురం నిరూపిస్తోంది!.

## అదనపు టీచర్ కోసం అధికారులకు వినతి... 85 మంది విద్యార్థులకు ఒకే గురువు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

నగరంలోని జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో తీవ్ర ఉపాధ్యాయుల కొరత నెలకొన్న నేపథ్యంలో, అదనపు ఉపాధ్యాయుని నియమించాలని అధికారులను కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ రావుకు విజ్ఞాపన పత్రం సమర్పించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య వైస్ చైర్మన్ పేర్ల భాస్కర రావు తెలిపారు. పాఠశాలలో ప్రస్తుతం సుమారు 85 మంది మత్స్యకార కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నప్పటికీ, కేవలం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టసాధ్యమైందని వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా, ఈ పాఠశాలలో ఆ నియమం పూర్తిగా విస్మరించబడిందని విమర్శించారు. ఈ సమస్యపై గత కొన్ని సంవత్సరాలుగా మత్స్యశాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం విచారకరమన్నారు. మత్స్యకార కుటుంబాల పిల్లలు ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన పరిస్థితుల్లో ఉన్నారని, ఇలాంటి నిర్లక్ష్యం వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం రాబోయే డీఎస్సీ నియామకాలలో అయినా మత్స్యశాఖ ద్వారా ఉపాధ్యాయులను నియమించి ఈ పాఠశాలకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అదనపు ఉపాధ్యాయుని నియమించి, మత్స్యకార పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని స్థానికులు, తల్లి దండ్రులు విన్నవించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించము: జే.సీ శౌర్యా మాన్

### ప్రజల నమ్మకం నిలబెట్టాలి: అధికారులకు జేసీ గట్టి సందేశం





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)" కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, వచ్చిన ప్రతి అర్జీపై 24 గంటల్లో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వారికి భరోసా కల్పిస్తూ అర్జీలను స్వీకరించారు. సంబంధిత శాఖ అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పునరావృతం జరిగితే బాధ్యత అధికారులపైనే ఉంటుందని హెచ్చరించిన ఆమె, ప్రతి అర్జీదారుతో మాట్లాడి సమస్య పూర్తి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్ ద్వారా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ ద్వారా 108 అర్జీలు, రెవెన్యూ క్లినిక్ ద్వారా 173 అర్జీలు అందగా, మొత్తం 281 వినతులు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావుతో పాటు వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చందనోత్సవానికి సింహగిరిపై హైఅలెర్ట్ ....

## ఏర్పాట్లు పరిశీలించిన హోం మంత్రి అనిత

**సింహాచలం,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:13**

ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న వార్షిక చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమగ్రంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక వసతులు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైతే ఆధునిక ఏఐ టెక్నాలజీ వినియోగం కూడా చేపట్టాలని సూచించారు. వేసవి దృష్ట్యా భక్తుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, తాగునీరు, మజ్జిగ



వంటి సదుపాయాలను విస్తృతంగా అందించాలని మంత్రి తెలిపారు. భక్తుల కోసం 10 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చందనోత్సవం ఒక అపురూపమైన ఆధ్యాత్మిక ఘట్టం అని పేర్కొన్నారు. గత సంవత్సరం




సుమారు 1.20 లక్షల మంది భక్తులు హాజరయ్యారని, ఈసారి దాదాపు 2 లక్షల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తెల్లవారుజామున 3 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని, అంతరాలయ దర్శనం ఉదయం 5 గంటల వరకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నైట్ ఫుడ్ కోర్ట్ తిరిగి ప్రారంభించాలని

# జీవీఎంసీ కమిషనర్‌కు వినతి





**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 13**

విశాఖ సిటీ పరిధి లో నైట్ ఫుడ్ కోర్ట్‌ను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఫుడ్ కోర్ట్ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష నిర్వహించిన కార్మికులు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం, నైట్ ఫుడ్ కోర్ట్ మూసివేసి ఇప్పటికే ఏడు నెలలు గడిచినా తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల చదువు ఫీజులు, వైద్య ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. స్మార్ట్ ఫుడ్ కోర్ట్ నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా పాత స్థలంలోనే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని వారు కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జీవీఎంసీ కమిషనర్, స్మార్ట్ ఫుడ్ కోర్ట్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, కంటైనర్ వ్యవస్థ కోసం టెండర్లు పిలిచామని, రెండు నెలల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు. అయితే, అప్పటి వరకు తాత్కాలికంగా నైట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు.

కార్మికులు 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని ప్రస్తావిస్తూ, ఫుడ్ కోర్ట్ తొలగించినపుడు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం లేదా అదే ప్రదేశంలో తాత్కాలికంగా వ్యాపారం కొనసాగించేందుకు అనుమతించాల్సిన బాధ్యత అధికారులదేనని వాదించారు. తమపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉండాల్సిన సమయంలో, తమ సమస్యలపై నిర్లక్ష్యంగా స్పందించడం బాధాకరమని వారు పేర్కొన్నారు. సెంట్రల్ పార్క్ వద్ద అర్హులుగా గుర్తించిన 97 మంది కార్మికులకు తాత్కాలికంగా ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని విశాఖపట్నం తోపుడుబండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. అలాగే ఉపాధి లేక ఆందోళనతో మరణించిన ముగ్గురు నైట్ ఫుడ్ కోర్ట్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కూడా కోరారు. నైట్ ఫుడ్ కోర్ట్ పునఃప్రారంభం వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. సుబ్బారావు, జిల్లా కార్యదర్శి పి. వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. సింహాచలం, ఫుడ్ కోర్ట్ నాయకులు కే. శ్రీకాంత్, దుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణ చర్యలకు ఆదేశాలు

## - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ సమీక్ష




**విశాఖసిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:13**

ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమంలో ఈ రోజు మొత్తం 130 ఫిర్యాదులు స్వీకరించబడినవి. ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత భాగ్చి ప్రత్యక్షంగా హాజరై తన కార్యాలయం నుండి పర్యవేక్షణ చేశారు. నగరంలోని అన్ని సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లు, పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్లు మరియు సబ్ ఇన్స్పెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ రోజు జరిగిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి 130 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ తమ సమస్యలను రాతపూర్వక రిపోర్టుల రూపంలో పోలీసు కమిషనర్ కి సమర్పించారు. కమిషనర్ ప్రతి ఫిర్యాదును వ్యక్తిగతంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. తదుపరి సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, ప్రతి కేసుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు ప్రధానంగా కుటుంబ కలహాలు, భూవివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించిన కేసులు మరియు సివిల్ కేసులకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



## ప్రజా సమస్యలపై వేగవంతమైన చర్యలకు అధికారులకు ఆదేశాలు: ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి





**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :13**

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని నాణ్యతతో, పారదర్శకంగా పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కే.వి. మహేశ్వర్ రెడ్డి, పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో ఎస్పీ స్వయంగా హాజరై మొత్తం 72 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సమగ్రంగా విచారణ చేసి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి, చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చూపాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను నిర్దిష్ట గడువులో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వీకరించిన 72 అర్జీలలో కుటుంబ వివాదాలు, మోసపూరిత కేసులు, ఆస్తి సమస్యలు, సివిల్, సైబర్ నేరాలు మరియు ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యత, వేగం రెండూ సమానంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు.

## గ్రామాలలో టి బి ముక్తా భారత్ అభియాన్ 2.0 పరీక్షలు...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 13**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టి బి ముక్తా భారత్ అభియాన్ 2.0 లో గ్రామంలో వైద్యాధికారి శ్యామలాప్రణయి పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి జిల్లా వైద్యాధికారిణి భరత లక్ష్మి తెలియజేశారు. కేశవ దాసు పాలెం 110 మంది మోదీ మోరి 120 మంది పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారి తెలియజేసి, ఉచిత మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంగతాయారు నాని, ఎంపీటీసీ సాయికుమారి అంజి, ఏ ఎన్ ఎమ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై ఫిర్యాదు వస్తే అధికారులపై కఠిన చర్యలు

## ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

### పన్నుల వసూలు పూర్తి కావాలి.. గ్రామాల్లో మౌలిక వసతులపై ఎమ్మెల్యే ఆనందరావు కీలక ఆదేశాలు

### అనధికార లేఅవుట్లపై ఎమ్మెల్యే ఆనందరావు సీరియస్.. నిబంధనలు అతిక్రమిస్తే లీగల్ నోటీసులు తప్పవు






**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

యోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు. సోమవారం అమలాపురం పంచాయతీరాజ్ అతిథి గృహంలో పంచాయతీరాజ్ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో ఎమ్మెల్యే ఆనందరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో అధికారులు వారం వారం వచ్చి పరిపాలనపై వివరణ ఇచ్చేవారని, ప్రస్తుతం నెలకోసారి కూడా కనిపించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నప్పుడు, ఉద్యోగులు కూడా అంతే బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, జూన్ 15 వరకు కాలువలు మూసివేసే అవకాశం ఉన్నందున చెరువులను నీటితో నింపాలని ఆదేశించారు. నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధుల కోసం 15 రోజుల్లోగా హౌస్ టాక్స్ వసూలు పూర్తి చేయాలని, తాగునీటి విషయంలో తనకు ఒక్క ఫోన్ కాల్ వచ్చినా సంబంధిత కార్యదర్శే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గంలోని పేరూరు, కామనగరువు, భట్నవిల్లి , బండారులంక వంటి అనేక గ్రామాల్లో ఉన్న అనధికార లే అవుట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గతంలో ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చిన కార్యదర్శుల డేటా సేకరించాలని, వారికి లీగల్ నోటీసులు పంపుతామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ (ాా=ా) ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం నిధులు తిరిగి పంచాయతీలకే వస్తాయని, కాబట్టి ఎంపీడీవోలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. తాగునీటితో పాటు పారిశుధ్యం, విద్యుత్ సమస్యలపై కూడా అధికారులు అలసత్వం వహించకూడదని ఎమ్మెల్యే కోరారు. దోమల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని, విష జ్వరాలు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. వీధి దీపాలు, వంగిపోయిన స్తంభాల సమస్యలను విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మ్యాన్ డేస్ టార్గెట్‌ను ఈ వేసవిలోనే పూర్తి చేయాలని,'సూర్య ఘర్' పథకం కింద ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు అధికారుల ప్రస్తుత పరిపాలనపైనే ఆధారపడి ఉంటాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. 15 రోజుల తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి పన్నుల వసూలు , తాగునీటి పనులపై స్పష్టమైన నివేదికలతో రావాలని,ఎమ్మెల్యే ఆనందరావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు,ఉప్పలగుప్తం మండల టిడిపి అధ్యక్షులు అరిగెల నానాజీ, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పిఎస్ మధుసూదన్ ఆకస్మిక పర్యటన



**కాకినాడ జిల్లా ఏప్రిల్ 13**

సిటిజన్ టైమ్స్ పిఠాపురం నియోజకవర్గం యు . కొత్తపల్లి మండలంలోని సూరప్ప చెరువు అభివృద్ధి పనులను డిప్యూటీ ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మధుసూదన్ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రూ. 9.55 కోట్ల వ్యయంతో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, పైపులైన్ తదితర అభివృద్ధి పనుల పురోగతిపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.పనులను వేగవంతం చేసి నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పాడా పీడీ శివరామ్ ప్రసాద్, ఆర్.డబ్ల్యు.ఎస్ డీఈ కృష్ణ, జేఈ రమణ పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవిత చరిత్రపై కాంపిటీషన్ ఎగ్జామ్



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

అంబేద్కర్ జయంతి సందర్భంగా అల్లవరం మండలం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ తూర్పులంక నందు అంబేద్కర్ యూత్ వారు చిల్లె పవన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్,మాథ్స్,జీకే, అంబేద్కర్ జీవిత చరిత్రపై కాంపిటేటివ్ ఎగ్జామ్స్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో 6,7వ తరగతుల నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో కంసాని శాంభవి, పొలమూరి ప్రవీణ, కే.దీపిక ప్రియా, 8, 9, 10వ తరగతి నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పందిరి మాన్విక, ఎం ప్రసక్తి, కె.బి. నాగ సిరి నిలిచారు. దీనికి సంబంధించి రేపు అంబేద్కర్ జయంతి సందర్భంగా తూర్పులంక అంబేద్కర్ విగ్రహం వద్ద బహుమతులు ఇవ్వబడును. ఈ కార్యక్రమంలో కే.సత్యనారాయణ, బత్తుల నకుల్ రాజు, ముత్యాల నరసింహారావు ,టి శారదా మాత, జి. మెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే ప్రాధాన్యత

### జిల్లా ఎస్.పి. రాహుల్ మీనా




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో (సోమవారం) జిల్లా పోలీస్ కార్యాలయం నందు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్.పి. రాహుల్ మీనా, జిల్లా అదనపు ఎస్.పి. ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ తో కలిసి స్వయంగా బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులతో ఎస్.పి.ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈరోజు కార్యక్రమంలో మొత్తం 24 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్.పి. అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా,జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్.పి. బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. తో పాటు, అదనపు ఎస్.పి. ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ , డి.పి.ఓ. సిబ్బంది ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సూపర్ డెంట్‌గా రామకృష్ణ

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

కోనసీమ జిల్లా ఎక్సైజ్ ఈఎస్ గా కె.రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సామర్లకోట ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్ గా పనిచేస్తున్నారు. ఆయనను ప్రభుత్వం ఎక్సైజ్ ఈఎస్ గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన సోమవారం విధుల్లో చేరారు.




# చెరువులపై కబ్జాల దందా...

# సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి

## జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు





**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :13**

పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని బిళ్ళబంద, దేవుడిబంద ప్రాంతాల్లో జరిగిన అక్రమ ఆక్రమణలను తక్షణమే గుర్తించి తొలగించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిసిసి జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు, లీగల్ సెల్ ఇన్‌చార్జ్ కోలా కిరణ్ కుమార్, ఏవో గంట మోహన్ రావు తదితరులు కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్వతీపురం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని కొంతమంది అక్రమార్కులు చెరువులు, బందాలు వంటి నీటి వనరులను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బిళ్ళబంద, దేవుడిబంద ప్రాంతాలు తీవ్రంగా కబ్జాలకు గురయ్యాయని పేర్కొన్నారు. బిళ్ళబందలో అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేసి, చెరువు ఆకృతి పూర్తిగా మారిపోయిందని తెలిపారు. అలాగే దేవుడిబందలో కూడా ఆక్రమణలు జరిగి, కొంతమంది పక్కా భవనాలు నిర్మించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిరాయితి సర్వే నెంబర్లతో బోగస్ పట్టాలు సృష్టించి, వాటి ఆధారంగా చెరువుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, పాత రికార్డుల ఆధారంగా బిళ్ళబంద, దేవుడిబంద ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేసి, స్పష్టమైన సరిహద్దులు నిర్ణయించాలని కోరారు. అక్రమంగా ఆక్రమించిన నిర్మాణాలు, లేఅవుట్లు తొలగించి, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఈ ఆక్రమణలు జరుగుతున్న సమయంలో బాధ్యతలు నిర్వర్తించని సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ మేరకు జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే మన లక్ష్యం

### విజయవాడ టిడిపి కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ఞ,కో ఇన్చార్జిల తో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.



**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :13**

విజయవాడలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్‌లు, కో-ఇంచార్జ్‌ల బాధ్యతలపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ ఇంచార్జ్‌లు మరియు కో-ఇంచార్జ్‌లు పార్టీకి వెన్నెముకలుగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ, ప్రతి కార్యకర్తతో సన్నిహితంగా మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ పార్టీ సిద్ధాంతాలను గ్రామాల్లో కార్యకర్తలకు విస్తృతంగా చేర్చాలని అన్నారు. అలాగే, ప్రతి క్లస్టర్‌లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ వారి విశ్వాసాన్ని పొందాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని మరింత బలోపేతం చేయడంలో అందరూ సమిష్టిగా కృషి పనిచేసి కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు మరియు కో-ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి అండగా మెగా వైద్య శిబిరం

## ముఖ్య అతిధి గా రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:13**

ఖమ్మం గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా జరిగింది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింతగా చేపట్టాలని సూచించారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యశోద హాస్పిటల్ వైద్య బృందం సేవలు అందించగా, ఖమ్మంలోని వాసన్ ఐ కేర్ నేత్ర వైద్యులు మరియు సాయి కేర్స్ డెంటల్ వైద్యులు కూడా పాల్గొన్నారు. వైద్యుల పర్యవేక్షణలో రోగులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్రాలపాడు 7వ డివిజన్ కౌన్సిలర్ బుర్ర మహేష్, స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ రావు, కోశాధికారి పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. సంఘం సలహాదారు అదాలత్ నరేంద్ర సూచనల మేరకు ఈ శిబిరం నిర్వహించబడింది. అలాగే గౌరవ సలహాదారుడు వెంపటి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు వెంపటి ఉపేందర్, అధ్యక్షుడు నూనావత్ కిషన్, సెక్రటరీ జానీ పాషా, ట్రెజరర్ ఆకుల సైదులు, ఉపాధ్యక్షుడు నజీర్ పాషా, కాత్రం గిరి, గోవింద భద్రం, ముది శెట్టి రామూర్తి, జాయింట్ సెక్రటరీ నామాల నరసింహారావు, ఈసీ సభ్యులు అంజి తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సముద్ర జలాలలో చేపల వేట నిషేధం

## జిల్లా మత్స్య శాఖ అధికారి వర్ధన్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రాదేశిక సముద్ర జలాలలో చేపల వేట చేయు యాంత్రిక పడవలు అనగా మెకనైజ్డ్ , మోటరైజ్డ్ బోట్ల ద్వారా నిర్వహించు అన్ని రకాల చేపల వేటను ఏప్రిల్ 15నుండి మే 14..,2026 వరకు అనగా "61" రోజుల పాటు సముద్ర జలాలలో చేపల వేటను నిషేధిస్తూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడమైనదని జిల్లా మత్స్యశాఖ అధికారి వర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. సముద్ర జలాలలో చేపల వేట నిషేధం ముఖ్య ఉద్దేశమని, చేప, రొయ్య, పీత జాతుల సంతానోత్పత్తి కాలములో తల్లి చేప,రొయ్య, పీతలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం అని తెలిపారు. సముద్ర మత్స్య సంపద పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా విధించిన ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి, సముద్ర జలాలలో యాంత్రిక పడవలు అనగా మెకనైజ్డ్ మరియు మోటరైజ్డ్ బోట్ల ద్వారా మత్స్యకారులు ఎటువంటి చేపలవేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించగలరు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపలవేట చేసినచో ఆయా బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టము 1994, సెక్షన్ (4)ను అనుసరించి శిక్షార్హులు. బోట్లను, బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనపరచుకొనుటయే గాక, జరిమానా విధిస్తూ, డీజిల్ ఆయిల్ రాయితీ, వేట నిషేధ భృతి, ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీ సౌకర్యాలు నిలుపుదల చేయబడును. ఈ నిషేధ కాలమును ఖచ్చితముగా అమలుచేయుటకై మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు మరియు రెవిన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేయడమైనది. కావున మత్స్యకారులు, మత్స్యకార పెద్దలు అందరూ సహకరించవలసిందిగా కోరడమైనది. ప్రస్తుతం సముద్రములో చేపల వేటలో ఉన్న బోట్లు అన్ని ఏప్రిల్ 14 అర్ధరాత్రి లోపు ఒడ్డుకు చేరి పట్టుబడిచేసిన మత్స్య సంపదను మొత్తం అమ్మకం, రవాణా చేసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ఏప్రిల్.15.నుండి చేపల వేటలో పట్టుబడిచేసిన అన్నిరకాల మత్స్య సంపదను స్వాధీనపరచుకోని జరిమానా విధించబడును అని తెలిపారు. ప్రస్తుతం తీరములో ఉన్నటువంటి బోట్లు దీర్ఘకాల చేపలవేట కు వెళ్ళరాదని పేర్కొన్నారు. సముద్ర జలాలతో చేపలవేట నిషేధ భృతి లబ్ధిదారుల ఎన్యుమరేషన్ (వివరాల సేకరణ) ఈ నెల 17వ తారీఖున జరుగును.



కనుక సంబంధిత బోటు యజమానులు, కళాసీలు బోటు వారీగా, బోటుతో సహా మత్స్యశాఖ అధికారులకు అందుబాటులో ఉండవలసినదిగా కోరినట్లు ఒక ప్రకటన లో తెలిపారు.

# కన్నులపండువగా కార్యసిద్ధి దాసాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ

### స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**జి.కొండూరు:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ 13:**

ఎన్టీఆర్ జిల్లా .మండల కేంద్రమైన జి.కొండూరులో కొలువుదీరిన కార్యసిద్ధి శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. సోమవారం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద నవధాన్యాలు సమర్పించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులపై నిరంతర పర్యవేక్షణ





**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 13**

చింతలపూడి ఏలూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సోమవారం లింగపాలెం మండలం పర్యటనలో భాగంగా వెళుతూ రహదారి నిర్మాణ పనులు ఏ విధంగా చేస్తున్నది నాణ్యత పాటిస్తున్నారా లేదా అనే విషయాలపై నిశితంగా పరిశీలించారు. అంతేకాకుండా నిత్యం ట్రాఫిక్ ఉండే ఈ రోడ్డు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేసే ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని పరివేక్షక సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు మార్జిన్ లను కూడా విశాలంగా వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా నిర్మాణపు పనులు శాశ్వత ప్రతిపాదికన చేయాలని శాసనసభ్యులు సొంగ.రోషన్ కుమార్ సూచించారు.

# మంచి నీటి సమస్యలకు చెక్ పెట్టిన కూటమి నాయకులు

**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ :13 :**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములగలంపాడు గ్రామంలో హరిజనవాడ లో గత కొంతకాలం గా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని కూటమి నాయకులు దినేష్ బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆయన తక్షణమే స్పందించి పైప్ లైన్ క్లీన్ చేయించి ఈరోజు ప్రతి ఇంటికి నీరు వచ్చేలా చేశారని అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దినేష్ బాబు మాట్లాడుతూ నీటిని వృధా చేయవద్దని, సరిపడా నీరు వచ్చిన తర్వాత టాప్స్(కుళాయి) కట్టేయాలని సూచించారు.అంతేకాకుండా రానున్న రోజుల్లో నీటి సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.



# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ హరేంధిర ప్రసాద్

### పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి ఆర్ బ్ల్యూఎస్ డ్వామ అధికారులకు ఆదేశాలు



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 13**

జిల్లాలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులు ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై జిల్లా ప్రజా పరిషత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, డ్వామా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కింద ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, డ్వామా శాఖ ద్వారా చేపట్టిన సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కాలువలు, చెరువులు, నీటికుంటలు, తాగునీటి పనులు, భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2026-27 ఏప్రిల్ నెలలో 11.40 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద 1007 పనులను రూ.49,859.42 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా ఇప్పటివరకు 581 పూర్తయ్యాయన్నారు. 426 పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఆయన తెలిపారు. ఇంటింటికి టాప్ కనెక్షన్ అందించాలని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్దేశించిన గడువులోగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్వై), నాబార్డ్ ఇతర కార్యక్రమాల కింద చేపట్టిన రోడ్లు,హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనుల త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధీర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ మతిన్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎవీఎస్ శ్రీనివాసరావు ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు, రైతులు, తాగునీటి అవసరాలే ప్రాధాన్యమన్న ఎమ్మెల్యే

**రామగిరి:( సిటిజన్ టైమ్స్ ) ఏప్రియల్ :13**



జలధార పథకం కింద ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశంపై పది రోజుల్లోపు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ అతిథి గృహంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో జలధార పథకం కింద పనుల ఎంపిక, నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార కార్యక్రమంలో ఎలాంటి పనులు చేయాలన్న అంశాల గురించి చర్చించారు. ఇందులో ముఖ్యంగా చెరువుల మరమ్మతులు, చెరువుల పటిష్టతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే రైతుల అవసరాలు, తాగునీటి సమస్య తీర్చే విధంగా పనులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, జలధార ఇన్చార్జి, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో కలిసి పనులను గుర్తిస్తామని అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే సునీత కొన్ని సూచనలు చేశారు. గ్రామంలో చేపట్టే ప్రతి పని రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అందుకే సాగునీటి సంఘాలు, రైతులు, గ్రామ ప్రజల సహకారంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. మొత్తం పది రోజుల్లో ఈ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆ తర్వాత పనులు ప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని దీని ఫలితాలు వచ్చే వర్షాకాలంలో మనకి కనిపించాలన్నారు. ఎక్కడ కూడా మనం చేపట్టే పని వృధాగా ఉండకూడదని... ఖచ్చితమైన ప్రణాళికతో దాని ఫలితాలు ఇచ్చే విధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

### మీ ప్రయాణం సురక్షితం కావాలంటే..

### హెల్మెట్ ధరించడం మరువకండి.

### వాహనదారులకు ట్రాఫిక్ సిఐ ప్రభాకర్ కౌన్సిలింగ్.



**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :13**

?అజిత్ సింగ్ నగర్లో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రత్యేక చర్యలు చేపట్టేమని అజిత్ సింగ్ నగర్ ట్రాఫిక్ సిఐ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం విజయవాడ పైపులు రోడ్డు సెంటర్ వద్ద ట్రాఫిక్కు పోలీసులు క్లిప్ యువర్ హెల్మెట్ ఫర్ సేఫ్టీ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి, వారికి హెల్మెట్ ప్రాముఖ్యతపై ట్రాఫిక్ సిఐ ప్రభాకర్ ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ కేవలం ఒక నిబంధన మాత్రమే కాదని, అది ప్రాణాలను కాపాడే రక్షక కవచమనీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్రమైన గాయాలు కావడం వల్లే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని, హెల్మెట్ ధరిస్తే అటువంటి ప్రమాదాల నుంచి 80 శాతం పైగా ప్రాణాపాయం తప్పుతుందని ఆయన వివరించారు. ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వ్యక్తి తిరిగి సురక్షితంగా రావాలని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారని, వారిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హితవు పలికారు. హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరమని, నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం ఫైన్లు వేయడం పోలీసుల ఉద్దేశ్యం కాదని, ప్రతి వాహనదారుడిలో మార్పు రావాలన్నదే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ సిబ్బందితో పాటు పలువురు వాహనదారులు పాల్గొన్నారు. సిఐ చేసిన కౌన్సిలింగ్ పట్ల స్థానికులు మరియు వాహనదారులు సానుకూలంగా స్పందించారు.

# పర్యావరణ పరిరక్షణలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ముందడుగు

## మియాపూర్, అమీన్‌పూర్ చెరువుల వద్ద క్లీన్ డ్రైవ్

**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 13**

విలాసవంతమైన జీవితం, ఏసీ గదుల్లో ఉద్యోగాలు.. ఇవేవీ వారిని సామాజిక బాధ్యత నుండి దూరం చేయలేదు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు చీపుర్లు పట్టి రోడ్ల మీదకు వచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం నడుం బిగించి, క్లీన్ డ్రైవ్ నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంట్రెక్ ఇండియా, వృక్షిత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ బృందం క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టింది. ప్రతి శని, ఆదివారాల్లో తమ వ్యక్తిగత సమయాన్ని పర్యావరణం కోసం కేటాయిస్తూ, నగరంలోని చెరువులు, కుంటల పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా తాజాగా మియాపూర్, అమీన్‌పూర్ చెరువు ప్రాంతాల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను ఈ బృందం ఏరివేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు అక్షిత, రిషిక, రోష్నిత్ మాట్లాడుతూ.. 2019 నుండి ఒక ప్రత్యేక టీంగా ఏర్పడి ఈ సామాజిక సేవను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మా సంస్థలో ప్రస్తుతం 5 వేల మంది సభ్యులు ఉన్నారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా 45 నగరాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పరిసరాల శుభ్రతతో పాటు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలను కూడా చేపడుతున్నాం. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని వారు కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, చెట్లను పెంచడం ద్వారానే మనం భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని, నీటిని అందించగలమని హితవు పలికారు. స్వచ్ఛంద సంస్థలు, సామాన్య ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దినేష్ వికాష్, ఆజేష్ శర్మ, భువన్ ఇలస్, మహునా, యష్ రాజ్, లౌకిక్, మౌనిక, హరి ఎం, భువి, కిత్విక, రాకేష్, నివేదిత, జిలేక్, సచిన్, కౌశిక్, వెంకట్ తదితరులు పాల్గొని తమ శ్రమదానాన్ని అందించారు.



# పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది.

**లుక్ తో అసంతృప్తి**

అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.





**మే లో కొత్త షెడ్యూల్**


కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి**

ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్డ్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్ అవుట్‌పుట్ సాధిస్తే అది భారీ రివార్డ్‌గా మారే అవకాశం ఉంది. కంటెంట్‌పై ఉన్న కాన్ఫిడెన్స్, క్లియర్ విజన్‌తో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్ట్ నిజంగా తారక్ లైఫ్ లో గేమ్ ఛేంజర్ అవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## ముంబై ఇండియన్స్‌కి బిగ్ షాక్.. ఐపీఎల్ నుంచి రోహిత్ ఔట్..



ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఏప్రిల్ 12న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో ఐదుసార్లు ఛాంపియన్ గా నిలిచిన ముంబై ఇండియన్స్‌కు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో ఇప్పటి వరకు 4 మ్యాచ్ లు ఆడిన ముంబై కేవలం ఒక్క మ్యాచ్ లోనే విజయం సాధించి 3 మ్యాచ్ ల్లో ఓడింది. ఈ క్రమంలో ముంబైకి మరో బిగ్ షాక్ తగిలింది. రోహిత్ శర్మకు తొడ కండరాల గాయం (హాంస్ట్రింగ్) జట్టును కష్టాల్లోకి నెట్టింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో 13 బంతుల్లో 19 రన్స్ చేసిన హిట్ మ్యాన్, క్రీజులో ఉన్నంతసేపు ఇబ్బంది పడ్డాడు. గాయం తీవ్రత పెరగడంతో, ఫిజియోతో చర్చించిన తర్వాత మైదానాన్ని రోహిత్ శర్మ వీడాల్సి వచ్చింది.

మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ ప్లేయర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ మాట్లాడుతూ.. రోహిత్ శర్మ గాయం ఎంత తీవ్రంగా ఉందో ప్రస్తుతానికి ఖచ్చితంగా చెప్పలేమని తెలిపాడు. ఇది అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, తాజాగా అందుతున్న నివేదికల ప్రకారం రోహిత్ శర్మకు వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాడు ఆయనకు స్కానింగ్ పరీక్షలు జరుగుతాయని, ఆ ఫలితాల ఆధారంగానే తదుపరి మ్యాచ్‌లలో ఆడేదానిపై క్లారిటీ వస్తుందని వెల్లడించాడు.

ముంబై ఇండియన్స్ తమ తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడబోతుంది. జట్టు యాజమాన్యం రోహిత్ విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు.. ఒకవేళ గాయం స్వల్పమైంది అయినప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌లో అతడికి విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. ఐపీఎల్ సుదీర్ఘమైన టోర్నీ కావడంతో, కీలకమైన చివరి దశ మ్యాచ్‌ల కోసం రోహిత్‌ను సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచాలని ముంబై ఇండియన్స్ యాజమాన్యం యోచిస్తోంది.

రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ప్లేయర్ దూరం కావడం ముంబై ఇండియన్స్ టీమ్ బ్యాటింగ్ లైనప్‌కు పెద్ద లోటు అని చెప్పొచ్చు. ఓపెనింగ్‌లో అతడు ఇచ్చే మెరుపు ఆరంభాలు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు రోహిత్ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు, ముంబై తిరిగి విజయాల బాట ఎలా పడుతుంది అనే అంశం ఆసక్తికరంగా మారింది. ఫ్యాన్స్ మాత్రం తమ అభిమాన ఆటగాడు త్వరగా కోలుకుని మైదానంలోకి రావాలని కోరుకుంటున్నారు.

## రికార్డు స్థాయిలో మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రైజ్ మనీ.. విన్నర్స్‌కి రూ. 21 కోట్లు!








ఈ సంవత్సరం జూన్‌లో మహిళల టీ20 ప్రపంచ కప్ జరగనుంది. ఇందుకోసం (2026, ఏప్రిల్ 13న) అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) భారీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచినట్లు వెల్లడించింది. 2 నెలల పాటు ఇంగ్లాండ్, వేల్స్‌లో జరిగే ప్రపంచ కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలియజేసింది ఐసీసీ. గత సీజన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెరిగింది. ఈసారి ఈ మెగా టోర్నమెంట్లో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 టీమ్స్ మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12వ నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ కొనసాగనుంది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. కాగా గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు ఉండగా, ఈసారి దాన్ని 82 కోట్లకు పెంచినట్లు ఐసీసీ ప్రకటించింది. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోనున్నారు. ఇక రన్నరప్ జట్టుకి 10 కోట్ల రూపాయలని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అయితే సెమీ ఫైనల్లోకి ఎంటరైన టీమ్స్ కి 6.29 కోట్ల రూపాయలు ఇవ్వనుండగా, గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకి రూ. 29 లక్షలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించింది ఐసీసీ. ప్రతి టీమ్ కు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో వెల్లడించింది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మొదటి మ్యాచ్ జరగనునంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భారత్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా ఈ మెగా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు జరగనున్నాయి.

## వైభవ్ పక్కనే ఫోన్ వాడిన రాజస్థాన్ మేనేజర్.. బీసీసీఐ షోకాజ్ నోటీసులు




ఐపీఎల్ 2026లో భాగంగా RCB vs RR మ్యాచ్ సందర్భంగా ఒక సంచలన ఘటన చోటు చేసుకుంది. స్టేడియంలో ఆటగాళ్ల మెరుపులు ఒకెత్తయితే, డగౌట్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి భిందర్, మ్యాచ్ జరుగుతుండగా డగౌట్‌లో కూర్చుని మొబైల్ ఫోన్ వాడుతూ కెమెరాలకు చిక్కారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, PMOA (Players and Match Officials Area) పరిధిలోకి వచ్చే డగౌట్‌లో ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వాడటం పూర్తిగా నిషేధం.

రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమి భిందర్ ఫోన్ చూస్తుండటం, పక్కనే యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఆ స్క్రీన్ వైపు ఆసక్తిగా చూడటం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిని యాంటీ కరప్షన్ (ACU) నిబంధనల ఉల్లంఘనగా పరిగణించిన బీసీసీఐ, 48 గంటల్లో వివరణ ఇవ్వాలని అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే రోమి భిందర్ ఏదో ఆరోగ్య సమస్య కారణంగానే ఫోన్ దగ్గర ఉంచుకున్నారని, దీని కోసం ముందే అనుమతి కోరారని సమాచారం. కానీ, అనుమతి ఉన్నా లేకపోయినా డగౌట్‌లో ఫోన్ వాడటం నిబంధనలకు విరుద్ధం కావడంతో బీసీసీఐ విచారణను వేగవంతం చేసింది. బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేసినట్లు తేలితే గనుక, భిందర్‌పై అధికారిక హెచ్చరిక, భారీ జరిమానా లేదా కొన్ని మ్యాచ్‌ల పాటు సస్పెన్షన్ విధించే ఛాన్స్ ఉంటుంది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరిపిన తర్వాత నివేదిక సమర్పించాలని ఏసీయూను ఆదేశించినట్లు తెలుస్తుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776